క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: ఓపెన్‌జిమ్‌ను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. తుర్కయంజాల్‌లోని 21వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బుధవారం వారు ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రావిచేడ్ గ్రామ సర్పంచ్ భారతమ్మ, ఉప సర్పంచ్ వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని వేంకటేశ్వర కాలనీలో గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించతలపెట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్‌యాదవ్, వార్డు సభ్యులు పవన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, భిక్షపతి, యాదయ్య, అంజయ్య, శివలింగం, దేవేందర్, సాయికుమార్, మహేశ్, కార్యదర్శి వెంకటయ్య ఉన్నారు.

చర్చి ముఖద్వారం పనుల పరిశీలన

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం ముఖద్వారం పునఃనిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, స్థానిక కౌన్సిలర్లు కవిత, ఐలయ్య, సునీల్ పరిశీలించారు. త్వరలో ముఖద్వార పనులు పూర్తిచేస్తామని చర్చి కమిటీ సభ్యులు.. కమిషనర్‌కు తెలియజేశారు. చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, శేఖర్ గౌడ్, జార్జి, బాలస్వామి పాల్గొన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న అశోక్‌రెడ్డి

కడ్తాల్: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బాచిరెడ్డి అశోక్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్.. అశోక్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి సాయిలాల్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, నాయకులు మహేశ్, వెంకటేశ్, శ్రీశైలంగౌడ్, రాందాస్‌నాయక్, విజయ్, విక్రమ్, సాయిప్రభు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

జ్ఞానవనం నిర్మాణానికి శంకుస్థాపన



జ్ఞానవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పద్మ

ఆమనగల్లు: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ బ్లాక్ వాయిస్ ఆధ్వర్యంలో నిర్మించే జ్ఞానవనం నిర్మాణానికి వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్ పద్మయాదయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలను జ్ఞానంవైపుగా తీసుకువెళ్లడానికి జ్ఞానవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. జ్ఞానవనంలో పార్క్, జిమ్, బుద్ధ విగ్రహం ఏర్పాటు చేస్తామని.. ఉచిత ఇంటర్నెట్ సదుపాయం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, శ్రీనివాస్, జంగయ్య, మహేశ్, రమేశ్, రాములు, వెంకటయ్య, పార్వతమ్మ, గ్రామ కార్యదర్శి తిరుపతి, తెలంగాణ బ్లాక్‌వాయిస్ ప్రతినిధులు వరుణ్, శివరాజ్, సుశాంత్, అరుణ్ పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

తలకొండపల్లి: లక్ష్యసాధన దిశగా విద్యాభ్యాసం చేయాలని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. మండల పరిధిలోని చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మన ఊరు–మన బడి కింద మంజూరైన రూ.42 లక్షల 54 వేలతో పాఠశాల అదనపు గదులను, డైనింగ్ హాల్‌ను నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారెడ్డి, స్కూల్ చైర్మన్ జంగయ్య, వార్డు సభ్యులు కృష్ణవేణి, యాదగిరిగౌడ్, రాణి, రాజు పాల్గొన్నారు.

పార్కింగ్‌తో పరేషాన్

- ఔటర్ సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా అక్రమ పార్కింగ్
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకుంటామంటున్న పోలీసులు



ఓఆర్ఆర్ సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై నిలిపిన లారీలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలోని ఔటర్ రింగ్ రోడు సమీపంలో విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా అడ్డగోలుగా లారీలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రింగ్ రోడ్డు కూడలి నుంచి 200మీటర్ల వరకూ రింగ్‌రోడ్డు నిర్వాహకుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ అక్రమ పార్కింగ్‌పై చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నారు. రింగ్ రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా చిరు వ్యాపార దుకాణాలు, హోటళ్లు ఉండటంతో 24గంటల పాటు వాహనాలు ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డు కిందకు వాహనాలు నిలిపితే ఎలాంటి ఇబ్బంది ఉండనప్పటికీ రోడ్డు పైనే గంటలపాటు నిలిపివేస్తున్నారు. అదే విధంగా అకస్మాత్తుగా వాహనాలను ముందుకు, పక్కకు తీస్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్రమ పార్కింగ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తాం

ఔటర్ కూడలి వద్ద అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం. వ్యాపారులకు కూడా నిర్ణీత సమయాల్లో దుకాణాలను మూసివేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తాం. కొత్తగూడెం కూడలి వరకు సైన్‌బోర్డు, వేగ నియంత్రణ కోసం జిగ్‌జాక్ రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తాం. ఇక్కడ పార్కింగ్ చేయరాదంటూ లారీ డ్రైవర్లకు, ఇతర వాహనదారులకు అవగాహన కల్పిస్తాం. అయినప్పటికీ అక్రమంగా పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. – మన్మోహన్, సీఐ, అబ్దుల్లాపూర్‌మెట్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. యాచారం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, సీసీరోడ్లు, డ్రైనేజీలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గాండ్లగూడెం గ్రామంలో కమ్యూనిటీ హాల్ కోసం రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్ఛ బాషా, నాయకులు కృష్ణ, అరుణ, శ్రీనివాస్‌చారి, అంజయ్య, సాయిలు, ఖాజు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా..

అబ్దుల్లాపూర్‌మెట్: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌరెల్లిలో రూ.80లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం బాటసింగారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌అలీ పాషా, ఎంపీపీ రేఖ, సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ లింగస్వామి, బీఆర్‌ఎస్ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు పాండు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

కౌన్సిలర్ రాధమ్మ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రాధమ్మ

ఆమనగల్లు: అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ కమటం రాధమ్మ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ, సంకటోనిపల్లి గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌తో కలిసి కౌన్సిలర్ రాధమ్మ ప్రారంభించారు. మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆమె వివరించారు. రూ.30 లక్షలతో 8వ వార్డులో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఏఈ భార్గవ్‌రెడ్డి, నాయకులు బాలయ్య, అనంతరాములు, యాదగిరి, పెద్దయ్య, మల్లేశ్, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను సిద్ధం చేయండి

బీఎల్ఓలతో డీటీ సమీక్ష

ఇబ్రహీంపట్నం: ఇంటింటికి వెళ్లి ఓటర్ సర్వేను చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం బూత్ లెవెల్ ఆఫీసర్స్(బీఎల్ఓ)తో డీటీ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వే చేపట్టాలన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 76 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఆయా పీఎస్‌ల పరిధిలోని ఓటర్ జాబితాలో తప్పులుంటే సరి చేయాలని, అదేవిధంగా మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. వారం రోజుల్లో ఇంటింటి ఓటర్ సర్వే పూర్తి చేయాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు రిజిష్టర్లను అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణ, మున్సిపల్ అధికారులు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ఏఈ ఇంద్రసేనారెడ్డి, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



ఇబ్రహీంపట్నం: మతపెద్దలను సన్మానిస్తున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి గుట్టపై ప్రత్యేక హోమం నిర్వహించారు. చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సర్వమత ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దలు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీఓ నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. వన దుర్గాదేవి ఆలయంలో కలెక్టరేట్ ఏఓ ప్రమీల రాణి, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లలితా సహస్ర నామం పఠించారు.

ఆమనగల్లు ఎస్ఐ బదిలీ



సుందరయ్య

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వి.సుందరయ్య బదిలీ అయ్యారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమనగల్లులో ఎస్ఐగా పనిచేస్తున్న వి.సుందరయ్యను శంకరపల్లి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయగా సుందరయ్య స్థానంలో ఆమనగల్లు ఎస్ఐగా ఎవరినీ నియమించలేదు. కాగా ఆమనగల్లు ఎస్ఐగా సెప్టెంబర్ 16న బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ సుందరయ్య కేవలం 9 నెలలకే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

‘ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి’



కడ్తాల్: హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్: ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై , రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక అభిషేకాలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, తులసీరాం, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, సీఐ ఉపేందర్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, ఎంపీడీఓ రామకృష్ణ, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్‌దే గెలుపు

- ఇబ్రహీంపట్నంలో 50వేల ఓట్ల మోజార్టీతో గెలుస్తా
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కాంగ్రెస్ శ్రేణుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. 58, 59 జీఓ పేరుతో రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 50 వేల మోజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని అన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు..

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేత, యాచారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అమృతాసాగర్, రాష్ట్ర నేత సాగర్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన 200 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, రాష్ట్రనేత ఈసీ శేఖర్‌గౌడ్, యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, జ్యోతి, జయమ్మ, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

తలకొండపల్లి: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్‌ను గద్దె దింపడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి నాయకత్వంలో కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి వెల్జాల్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణంలో కల్వర్టుల నిర్మాణాలు పూర్తిచేయనందుకు నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రం నుంచి శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ అజీం, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ రాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రమేష్, మైనార్టీ అధ్యక్షుడు ఆరీఫ్ నాయకులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు



తుర్కయంజాల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం: యోగాసనాలు వేస్తున్న ఎంపీపీ కృపేశ్, విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా డే వేడుకలు నిర్వహించారు. ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప వరం యోగా అన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం రూరల్: యోగా చేస్తున్న విద్యార్థులు



ఆమనగల్లు: విద్యార్థుల యోగాసనం



కడ్తాల్: ఓం ఆకారంలో విద్యార్థుల యోగాసనం